# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 17 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 266

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న పొంగులేటి




2లో

## వర్సిటీ భూములపై సర్కార్‌కు

# చెంపదెబ్బ

### కంచగచ్చబౌలి భూములపై సుప్రీం సీరియస్



- సుప్రీం మార్గదర్శకాలు విస్మరించి చెట్ల నరికివేతపై ఆగ్రహం
- ఆ భూముల్లోనే తాత్కాలిక జైలు నిర్మించి అధికారులను వేస్తాం
- నాలుగు వారాల్లో పునరుద్ధరణ నివేదిక సమర్పించాలని ఆదేశం
- స్టేటస్‌కో కొనసాగుతుందని వెల్లడి...విచారణ మే 15కు వాయిదా

పర్యావరణ పరిరక్షణకు అవుట్ ఆఫ్ ద వే వెళ్తామన్న కోర్టు వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిక

న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలని అన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కో కొనసాగుతుందని అన్నారు.

కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరపున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు-, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు

కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు- కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం.





## సోనియా,రాహుల్‌లపై ఇడి కేసు

నేడు ఇడికార్యాలయం ముందు ధర్నా: పిసిసి

హైదరాబాద్:సోనియా, రాహుల్‌లపై ఇడి కేసులకు నిరసనగాటీ-పీసీసీ ఆధ్వర్యంలో గురువారం ఈడీ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ వైఖరిని నిరసిస్తూ.. రేపు ఉదయం 10 గంటలకు ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ధర్నాకు దిగనున్నట్లు- తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..ఈడీ ఛార్జిషీట్లలో సోనియా, రాహుల్ పేర్లను కక్ష పూరితంగా చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులను నిరసిస్తూ ధర్నా ఉంటు-ందని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. కాగా, నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించిన మనిలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మంగళవారం చార్జ్‌షీటు- దాఖలు చేసింది. కాంగ్రెస్ ఓవర్ సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా, సుమన్ దూబేతో సహా మరికొందరు ముఖ్యనేతల పేర్లను కూడా చార్జ్‌షీటు-లో పేర్కొంది. సోనియా, రాహుల్, ఇతర నాయకులు, యంగ్ ఇండియన్ అనే ప్రైవేటు- కంపెనీతో సహా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు మనీలాండరింగ్ కు పాల్పడ్డారని, నేరపూరిత కుట్ర పన్నారని ఫిర్యాదులో ఈడీ ఆరోపించింది. ఏప్రిల్ 25న ఈ కేసు తదుపరి విచారణను చేపట్టనున్నట్లు- ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు తెలిపింది.



3లో

### గచ్చిబౌలి భూములపై వీడియో షేర్

సీనియర్ అధికారి స్మితాకు పోలీసుల నోటీసులు



3లో

### సుప్రీం తీర్పును స్వాగతించిన బిఆర్ఎస్

ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్న కెటిఆర్



## భారీగా పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా చోటు-చేసుకుంటు-న్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98,100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ.97,650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ -టైం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక మంది కూడా సురక్షితమైన బంగారం పెట్టు-బడులపైన ఫోకస్ చేస్తున్నారు.

అమెరికా, చైనా మధ్య గత కొన్ని రోజులుగా సుంకాల విషయంలో ఘర్షణ నెలకొన్న సంగతి తెలిసిందే. పరస్పరం టారిఫ్‌లు విధించుకోవడంతో పాటు ఎగుమతుల విషయంలోనూ ఆంక్షలు విధించుకుంటున్నాయి. ఈ అనిశ్చితులు కొనసాగుతున్నంత వరకు బంగారానికి డిమాండ్ కొనసాగుతుందని అనలిస్టులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న ముందస్తు అంచనాలు కూడా బంగారం ధర పెరగడానికి కారణమని పేర్కొంటున్నారు.



2లో

### భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



2లో

### తెలంగాణలో రాగల మూడ్రోజులు వర్షాలు

ఈదురుగాలులతో వానలు పడే అవకాశం

## రూ.27 వేల కోట్ల పెట్టుబడులు




రాష్ట్రంలో 2035 నాటికి 40 వేల మెగావాట్ల హరిత ఇంధనం(గ్రీన్ పవర్) ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

హైదరాబాద్: రాష్ట్రంలో 2035 నాటికి 40 వేల మెగావాట్ల హరిత ఇంధనం(గ్రీన్ పవర్) ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రణాళిక అమలులో భాగంగా జనవరిలో క్లీన్ అండ్ గ్రీన్ పవర్ పాలసీని అందుబాటులోకి తెచ్చామన్నారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సమక్షంలో రూ.27 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రెడ్కోతో ఈ-కోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్యా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. "సుమారు 5,600 మెగావాట్ల హరిత ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు ఈ రెండు కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు సన్ పెట్రో అనే కంపెనీ 3,400 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకుంది. అలాగే మేఘా కంపెనీ రూ.7,500 కోట్ల పెట్టుబడులతో రూ.1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ముందుకు వచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగి 17,162 మెగావాట్లకు చేరినా కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం.కేంద్ర ప్రభుత్వ సంస్థల సర్వేల ప్రకారం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2035 నాటికి 31,809 మెగావాట్లకు పెరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాన్ని కాలుష్యానికి దూరంగా ఉంచాలనే సంకల్పంతో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై దృష్టి సారించాం. సరళమైన నిబంధనలతో అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. తాజాగా ఒప్పందం చేసుకున్న కంపెనీలు ప్రణాళికను రూపొందించుకొని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలి" అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్యా ఎండీ దీపక్ అగర్వాల్, ఈ-కోరెన్ ఎనర్జీ సీఎండీ ప్రసాద్ యెర్నేని, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జీఎం మజుందార్, రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్, రెడ్కో ఎండీ అనిల తదితరులు పాల్గొన్నారు.



## జపాన్‌లో భారత రాయబారితో సీఎం రేవంత్ భేటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం బుధవారం జపాన్ చేరుకుంది. జపాన్‌లో భారత రాయబారి శిబు జార్జ్‌తో భేటీ అయింది.

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం బుధవారం జపాన్ చేరుకుంది. జపాన్‌లో భారత రాయబారి శిబు జార్జ్‌తో భేటీ అయింది. టోక్యోలోని వందేళ్ల చరిత్ర కలిగిన ఇండియా హౌజ్‌లో ఈ సమావేశం జరిగింది. శిబు జార్జ్ వారికి విందు ఇచ్చారు. పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు డీఎంకే ఎంపీ కనిమొళి, మాజీ ఎంపీ నెపోలియన్ కూడా పాల్గొన్నారు.



2లో

### సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

కాంగ్రెస్ పర్యావరణ విధ్వంసాన్ని గుర్తించిన ధర్మాసనం మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి

వేగుచుక్క

## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. బుధవారం ఉదయం గ్యాప్ డౌన్ తో స్టార్ట్ అయిన మార్కెట్లు–.. నిమిషాల వ్యవధిలోనే కోలుకొని బుల్ ర్యాలీ తీశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 309.40 పాయింట్లు (0.40 శాతం) లాభంతో.. 77,044.29 వద్ద, నిఫ్టీ 108.65 పాయిం(0.47శాతం) లాభంతో.. 23,437.20 పాయింట్ల వద్ద నిలిచాయి. నిఫ్టీ రెండు వారాల గరిష్ట స్థాయిని తాకడం మరో విశేషం. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 738.25 పాయింట్లు–(1.41 శాతం) పెరిగి 53,117.75 వద్ద, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 371 పాయింట్లు– పెరిగి 52,345 వద్ద స్థిరపడటంతో మార్కెట్ సెంటిమెంట్ ఉత్సాహంగా ఉంది. ఈక్విటీ– బెంచ్‌మార్క్‌లు ఇవాల్టి సెషన్‌ను రోజు గరిష్ట స్థాయిలో ముగించడం మరో ఆసక్తికర అంశం. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగం షేర్లలో బలమైన కొనుగోళ్ల కారణంగా వరుసగా మూడవ రోజు లాభాలను నమోదు చేశాయి. దలాల్ స్ట్రీట్‌లో బ్యాంకులు ముందంజలో ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నిఫ్టీ లాభాల్లో కీలక పాత్ర పోషించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ 4–5శాతం ర్యాలీ తీసి మిడ్‌క్యాప్ సూచీలను ముందుకు తీసుకెళ్లాయి. నిన్న భారత స్టాక్ మార్కెట్లు భారీ స్థాయిలో పెరిగిన సంగతి తెలిసిందే. అదే ఊపును మార్కెట్లు– ఇవాళ వరుసగా మూడో రోజు కొనసాగించడం విశేషం. నిన్న మంగళవారం సెన్సెక్స్ 1,671.65 పాయింట్లు– లేదా 2.22 శాతం లాభంతో.. నిఫ్టీ 513.45 పాయింట్లు– లేదా 2.25 శాతం లాభంతో ముగిసిన సంగతి తెలిసిందే.

### తెలంగాణలో రాగల
## మూడ్రోజులు వర్షాలు
### ఈదురుగాలులతో వానలు పడే అవకాశం

**హైదరాబాద్:** తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే ఛాన్స్ ఉందని చెప్పింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు పడుతాయని తెలిపింది. కొన్ని జిల్లాల్లో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, మరికొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతోపాటు– ఉరుములు, మెరుపులతో
కూడిన వర్షం పడే సూచనలున్నాయని పేర్కొంది. రాగల మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందంది. నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టం నుంచి 1.5 కి.మీ.ఎత్తులో కొనసాగిన ఉపరితల ఆవర్తనం.. బలహీన పడిందని వాతావరణ కేంద్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం సైతం హైదరాబాద్ మహానగరంలో ఉదయం నుంచి ఎండలు మండిపోయాయి. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి ఉన్న సంగతి తెలిసిందే. ఇక వాతావరణంలో తేమ శాతం బాగా తగ్గిపోయింది. ఇక నీటి ఎద్దడి సైతం ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తోంది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు–. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ– తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైంది. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన.. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననం. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ–కి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించాం. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లు–గా తయారైన రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

హైదరాబాద్: ధరణి స్థానంలో తీసుకుని వచ్చిన తెలంగాణ భూ భారతి కార్యక్రమం గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే.. వికారాబాద్




జిల్లా పుడూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ఇది. దీని ప్రయోజనం రాష్ట్రంలో భూ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడం , రైతులకు, పర్యావరణానికి అనుకూలంగా భూముల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం, తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్, భూమి చట్టాలు, ఆస్తి హక్కుల పునరుద్ధరణ వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది. భూ భారతి కార్యక్రమం ద్వారా, ప్రభుత్వమే భూముల ఖాతాలు, రికార్డులను సరికొత్తగా సృష్టించి వాటి మాలికల హక్కులను సులభంగా ప్రజలకు అందించేందుకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రైతులకు భూములపై

# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

### దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి
### మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి

**న్యూఢిల్లీ:** ట్రంప్ అమెరికా అధ్యక్షుడుయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోడీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణలతో పాటు రాజకీయనేతలో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు.
విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు
ఇప్పటికైనా స్పందించాలి. మోడీ విధానాలకు తందానా అనకుండా అంతర్గగత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు



పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప
అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని,
సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. నల్లధనాన్ని తవ్వితీయ డమనే ప్రకటిత లక్ష్యాన్ని
సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించి పన్నులను హేతుబద్దీ కరించాలి. పోపుల డబ్బాలో కూడబెట్టుకున్న దానికి సైతం జిఎస్టీ కట్టే దరిద్రం దాపురించింది. అధికారం లోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదు. ఈ క్రమంలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది.

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !

అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహితంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శతృవులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్తలను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా
చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చు కోవాలి. ఇటీవల ఆక్వా ఎగగుమతులపై ట్రంప్ ప్రభావం పడింది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు.

# వరుసగా రెండోరోజూ ఈడి విచారణకు వాద్రా

### భర్త వెంట వచ్చిన ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: హరియాణా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా రాబర్ట్ వాద్రా వరుసగా రెండోరోజు ఇడి ముందు హాజరయ్యారు. ఇది కక్షపూరిత కేసని అన్నారు. ఎప్పుడో పాత కేసులో మళ్లీ ఇప్పుడు విచారణ ఏమిటని ప్రశ్నించారు. రాబర్ట్ వాద్రా బుధవారం మరోసారి ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన వెంట ప్రియాంక కూడా ఉన్నారు.
ఈ కేసుకు సంబంధించి వాద్రాకు ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. నోటీసులు అందిన అనంతరం ఆయన నడుచుకుంటూ కార్యాలయానికి వెళ్లారు. దాదాపు ఐదు గంటల పాటు– ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయగా.. బుధవారం కూడా హాజరుకావాలని ఆదేశించారు. ఈక్రమంలోనే ఆయన తాజాగా ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట ప్రియాంక కూడా ఉన్నారు. ఈసందర్భంగా వాద్రా లోపలికి వెళ్తుండగా ప్రియాంక ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం వాద్రాను అధికారులు విచారిస్తున్నారు. ప్రియాంక కార్యాలయంలోని వెయిటింగ్ రూమ్‌లో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా.. విచారణకు హాజరయ్యే సమయంలో వాద్రా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇది చాలా దురదృష్టకరం. ప్రభుత్వ తప్పిదాలను బయటకు
చెప్పేవారిపై ఈడీతో సహా ఇతర ఏజెన్సీలు దాడులు చేస్తున్నాయి. దీన్ని దేశంలోని ప్రతిఒక్కరూ గమనిస్తున్నారు. ఈ ఏజెన్సీలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలా చేస్తున్నారు. నాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా నేను పోరాటం చేస్తున్నా. అందుకే ఇది జరిగింది.
ప్రజలు నాతో ఉన్నారు. వారు నన్ను రాజకీయాల్లో చూడాలను కుంటున్నారని వాద్రా పేర్కొన్నారు. ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు–. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది.

# చురుకుగా ధాన్యం కొనుగోళ్లు

హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లపై విపక్ష బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని రాష్ట్రప్రభుత్వం తిప్పికొట్టడమే గాకుండా గణాంకాలతో ధాన్యం సేకరణపై స్పష్టతను ఇచ్చింది. గతంలో లాగా ప్రచార హడావిడి చేయడం లేదు. కెసిఆర్ హయాంలో ఊరూరా కొనుగోళ్లు అంటూ ఊదరగొట్టినా కొనుగోళ్లు అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టతను ఇచ్చారు. పౌరసరఫరాలశాఖ ధాన్యం సేకరణ దిశగా చురుకుగా ఏర్పాట్లు మొదలుపెట్టింది. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో అధికారులు రంగం సిద్దం చేశారు. గతంలో కెసిఆర్ పాలర పాలనలో కేంద్రంతో వివాదం ఏర్పడడంతో పాటు కొనుగోళ్ల వ్యవహారమంతా గందరగోళంగా మారడంతో ధాన్యం రైతులు తీవ్ర అయోమయానికి గురయ్యారు. ఎట్టకేలకు రేవంత్ ప్రభుత్వం కొనుగోళ్లను ప్రారంభించామని, మద్దతు ధరలకే కొంటామని ప్రకటించడమే కాకుండా ఆ దిశగా యంత్రాంగమంతా ఏర్పాట్లు చేయాలంటూ ఆదేశించింది. దీంతో అధికారులు ఇప్పటికే రూపొందించిన ప్రణాళిక ఆధారంగా ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఈ మేరకు పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ సాఫీగా సాగుతోంది. మరోవారం రోజుల్లోగా కోతలు మొదలుకానుండడమే కాకుండా ధాన్యమంతా చేతికి అంద బోతోంది. ప్రస్తుతం కొనుగోలు చేసే ధాన్యాన్ని నిల్వ వ్యవహారం కూడా అధికారులకు కత్తిమీద సాములా మారబోతోందం టున్నారు. కాగా సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాలోకి ధాన్యం రాకుండా అడ్డుకునేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీసారి ధాన్యాన్ని ఉంచేందుకు అవసరమయ్యే గోనే సంచుల కొరత తీవ్రమవుతున్న సంగతి తెలిసిందే. పంట కొనుగోలుకు అనుగుణంగా గోనెసంచులు అందుబాటులో
లేకపోతుండడం ఇబ్బందులకు కారణమవుతోంది. కొనుగోళ్ళు
ప్రారంభమైన కొద్దిరోజులకే గోనెసంచుల నిల్వలు అయిపోతున్న కారణంగా అధికారులు ఈ సంచుల కోసం నానా తంటాలు పడుతున్నారు. కాగా గోనే సంచులు సైతం బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం గోనే సంచుల వినియోగం కూడా తగ్గుముఖం పట్టడంతో వీటి ఉత్పత్తి పెద్దగా జరగడం లేదంటున్నారు. కేవలం ధాన్యంకోసం మాత్రం గోనె సంచుల అవసరం ఏర్పడుతోంది. ప్రతీఏటా పంటలను నిల్వ చేసేందుకు అవసరమయ్యే గిడ్డంగుల సౌకర్యం కొరతగా మారుతోంది.

# తిరుమల తులాభారం కానుకల గోల్‌మాల్

**తిరుమల:** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిరుమల శ్రీవారి ఆలయంలో భారీ స్కాం జరిగిందని, కోట్లాది రూపాయల తులాభారం కానుకలను ఇంటి దొంగలు కాజేసారని టీటీడీ పాలకమండలి
సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మీడియాతో మాట్లాడుతూ.. స్వామి వారికి మొక్కులు చెల్లింపులో భాగంగా భక్తులు వివిధ రూపంలో తులాభారం సమర్పిస్తారని, తులా భారం ద్వారా నిత్యం 10 లక్షల రూపాయలు.. కానుకలను భక్తులు సమర్పిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కోట్లాది రూపాయల తులా భారం కానుకలను స్వాహా చేశారన్నారు. తులా భారంలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నివేదిక ఇస్తే.. అధికారులు తాత్కాలిక ఉద్యోగులను తొలగించి మిన్నకుండిపోయారని భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. తులా భారంలో అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. శ్రీవారి ఆలయం వద్ద డ్రోన్ ఎగరడం.. నిఘా వైఫల్యంగా భావిస్తున్నామన్నారు. భద్రతా సిబ్బంది కొరత వుందని.. సిబ్బందిని కూడా పెంచుతామని ఆయన తెలిపారు. త్వరలోనే యాంటీ డ్రోన్ టెక్నాలజీని తీసుకొస్తామని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కాగా తిరుమల శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతంలో మంగళవారం డ్రోన్ ఎగరడం కలకలం రేపింది.
అత్యంత పవిత్రమైన, భద్రతాపరంగా కీలకమైన ఈ ప్రాంతంలో డ్రోన్ కెమెరాను అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి రాజస్థాన్‌కు చెందిన ఓ యూట్యూబర్‌ను తిరుమల విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన యూట్యూబర్ మంగళవారం దాదాపు పది నిమిషాల పాటు– శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను వినియోగించినట్లు– తెలిసింది. అంతకుముందు, ఉదయం నుంచే ఆ వ్యక్తి తిరుమలలోని వివిధ ప్రదేశాలలో వీడియోలు చిత్రీకరిస్తున్నట్లు విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. డ్రోన్ గగనతలంలో ఎగురుతున్న విషయాన్ని గమనించిన విజిలెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించారు. ప్రస్తుతం యూట్యూబర్ ను విచారిస్తున్నామని, డ్రోన్ కెమెరా మెమరీ కార్డును స్వాధీనం చేసుకొని అందులోని దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

వేగుచుక్క

# అప్పుల భారం ఉన్నా... వాగ్దానాలను అమలు చేస్తున్నాం.

**మంత్రి జూపల్లి కృష్ణారావు.**

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ.**



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఏప్రిల్ 16**

గత ప్రభుత్వ అసంబద్ధ పాలన వల్ల తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆక్షేపించారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తోందని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని లబ్దిదారులకు బుధవారం ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో మంత్రి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి రాష్ట్రాన్ని 64 సంవత్సరాల పాటు పాలించిన 21 మంది ముఖ్యమంత్రులు 64 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తే, గత ప్రభుత్వం కేవలం పది సంవత్సరాల వ్యవధిలోనే 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని దుయ్యబట్టారు. అయినా కూడా ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాల సాగు భూమి, నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ వంటి హామీలను గత ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన రూ. 8 లక్షల అప్పులపై ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతీ నెల వడ్డీ రూపంలోనే 6 వేల కోట్లు, సంవత్సరానికి 70 వేల కోట్ల రూపాయలు కట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. అప్పుల భారం వల్లనే షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఇప్పటికిప్పుడు తులం బంగారం అందించలేని పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మిగితా అన్ని హామీలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ పై రూ. 500 సబ్సిడీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి ఐదు లక్షల నుండి పది లక్షల రూపాయలకు పెంపు, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ వంటి అనేక అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం తమ ప్రభుత్వ నిబద్ధత, ప్రజాపాలనకు నిదర్శనమని గుర్తు చేశారు. ధరణి వల్ల ఇబ్బందులు పడ్డ రైతులకు భూభారతి చట్టాన్ని తెచ్చి సాంత్వన చేకూరుస్తున్నామని అన్నారు. 21 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తూ, రైతులకు రెండు లక్షల రూపాయల లోపు పంట రుణాలు మాఫీ చేశామని అన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించాలని, తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కేవలం ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తమ ప్రభుత్వం, రానున్న రోజుల్లో మరింత విస్తృత స్థాయిలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనుందని తెలిపారు. కాగా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు సంబంధిత ధృవీకరణ పత్రాలు జతచేస్తూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న నెల రోజుల లోపు వారికి చెక్కులు అందేలా ఏర్పాట్లు చేశామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఎవరు కూడా కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి ఫోన్ కు చెక్కు మంజూరీ సమాచారం అందుతుందని సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ఆర్మూర్ నియోజకవర్గంలోని 459 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్షా 116 రూపాయల చొప్పున 4.59 కోట్ల రూపాయల విలువ చేసే చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండడం వల్ల చెక్కుల పంపిణీలో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా కౌంటర్లను నెలకొల్పి లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జీ వినయ్ రెడ్డి, ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి శంకుస్థాపన**

జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద రూ. 3 కోట్లతో చేపట్టనున్న మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి భూ భారతి అవగాహన సదస్సులు.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 16:**



జిల్లాలోని మండల కేంద్రాల్లో భూ భారతి అవగాహన సదస్సులు ఈ నెల 17 నుండి ఈ నెల 30 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన భూ భారతి కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అందులో భాగంగా ప్రతీ మండల కేంద్రంలోని రైతు వేదిక లేదా ఇతర ప్రాంతాలలో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 17 న ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు పాల్వంచ రైతు కేంద్రంలో, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాచారెడ్డి మండలం గజియా నాయక్ తాండా రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందని, 19 న ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు ఎల్లారెడ్డి మండల కేంద్రం లోని రైతు వేదికలో, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు నాగిరెడ్డిపేట రైతు వేదికలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 21 నా పిట్లం మండల కేంద్రంలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, పెద్ద కొడప్ గల్ రైతు వేదికలో మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు, 22 న రామారెడ్డి లో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు రైతువేదికలో, బిక్నూర్ రైతువేదికలో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు, 23 న గాంధారి రైతువేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, సదాశివనగర్ రైతువేదికలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 వరకు, 24 న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12.30 వరకు మున్నూరు కాపు సంఘం, వీక్లీ మార్కెట్ కామారెడ్డి లో, తాడ్వాయి రైతు వేదికలో మధ్యాహ్నం 1.30 నుండి 3.30 వరకు , రాజంపేట రైతువేదికలో 3.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 25 న జుక్కల్ రైతు వేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, బిచ్కుంద శాంతి మున్నూరుకాపు ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 వరకు, ఈ నెల 26 న బీబీపేట్ రైతువేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, దోమకొండ రైతువేదికలో మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు, 28 న నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12.30 వరకు, మహమ్మద్నగర్ రైతు వేదికలో మధ్యాహ్నం 1.30 నుండి 3.30 వరకు, బాన్సువాడ రెడ్డి సంఘం లో మధ్యాహ్నం 3.30 నుండి 6 గంటల వరకు, 29 న డోంగ్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, మద్నూర్ రైతువేదికలో మధ్యాహ్నం 2 నుండి 5 వరకు, 30 న బిర్కూర్ రైతువేదికలో ఉదయం 10 నుండి ఒంటిగంట వరకు, నసురుల్లబాద్ రైతువేదిక లో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు అవగాహన సదస్సులు నిర్వహించబడుతాయని కలెక్టర్ వివరించారు. ఈ అవగాహన సదస్సులకు 200 మందికి తక్కువ కాకుండా మండలంలోని ప్రజలు, రైతుల ను ఆహ్వానించాలని, ముఖ్యంగా ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక.**

**సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి.**

**జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి.**

**ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 16**

ఇందిరమ్మ ప్రజా పాలనతో కూడిన తెలంగాణ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలు అందేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు పలికారు. సన్న బియ్యం పంపిణీ, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యతనిస్తూ సమస్యలు తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రగతి గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, మార్కెటింగ్, పౌర సరఫరాలు, హౌసింగ్, భూభారతి తదితర శాఖల అమలు తీరుపై మంత్రి సమగ్ర చర్చ జరిపారు.

ప్రస్తుత వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. స్థానికంగా నీటి వనరులు లేని ప్రాంతాల్లో బోరుబావులు అద్దెకు తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాలలో, ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని సూచించారు. అధికారులు వాస్తవ నివేదికలు ఇవ్వాలని, తాము క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతామని, ఏమైనా తేడాలు ఉంటే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాను పక్కాగా పర్యవేక్షిస్తూ, సంబంధిత నీటి పథకాల నిర్వహణ జరుపుతున్న ఏజెన్సీలకు పక్కాగా లెక్కింపులతోనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ గ్రిడ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో వ్యక్తికి ప్రతీరోజూ కనీసం వంద లీటర్లు, పట్టణ ప్రాంతాల్లో 150 లీటర్ల చొప్పున నీటి సరఫరా జరగాలన్నారు. ఆర్మూర్ పట్టణానికి అమృత్ పథకం కింద 43 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని, తాగునీటి సరఫరాను మెరుగుపరిచే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, రోడ్డు నిర్మాణాలు, మరమ్మతు పనులు సక్రమంగా చేపట్టకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లను విచారణ జరిపి బ్లాక్ లిస్టులో పెట్టాలని మంత్రి జూపల్లి కలెక్టర్ కు సూచించారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందని, నిజామాబాద్ జిల్లా నుండి ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాలకు సన్న బియ్యం సరఫరా చేస్తుండడం అభినందనీయం అని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, జిల్లాను ఆదర్శంగా నిలపాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, పూర్తి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ ఉండాలన్నారు. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకూడదని, ఎక్కడైనా అవినీతి అక్రమాలకు తావిస్తే రికవరీ చేయిస్తామని మంత్రి తేల్చి చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద లబ్ధిదారులకు ఐకేపీ మహిళా సంఘాల ద్వారా ఇళ్లను నిర్మింపజేసి, ఆ తరువాత బిల్లులను మహిళా సంఘాలకు అందించేలా చొరవ చూపాలని అన్నారు. కనిష్టంగా 400 స్క్వేర్ ఫీట్లు, గరిష్టంగా 600 స్క్వేర్ ఫీట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు. ఇందిరమ్మ ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన ప్రతి కుటుంబానికి గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందేలా ఇంటింటి సర్వే ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ,

రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 16:**



పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. నూతనంగా కొనుగోలు చేసిన నీటి ట్యాంకర్లకు బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, పట్టణంలో నీటి సరఫరాకు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి పట్టణంలో ఇప్పటికే 8 ట్యాంకర్ల ద్వారా ఈ వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉన్న వార్డుల్లో నీటిని సరఫరా చేయడం జరుగుతున్నదని, పట్టణ విస్తీర్ణం పెరగడం, నీటి ఎద్దడి తలెత్తడంతో కొత్తగా 50 లక్షల రూపాయలతో ఐదు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ వేసవి కాలంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నీటిని సరఫరా చేసి ప్రజల సమస్యలను తీర్చాలని అధికారులకు సూచించారు. అలాగే 40 లక్షలతో కొనుగోలు చేసిన జె.సి.బి. కి కూడా పూజ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియ కొనసాగిన తీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని మున్సిపల్ బోర్ల నుండి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న వాటిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, హౌసింగ్ పిడి విజయ్ పాల్ రెడ్డి, మున్సిపల్ ఏఈ శంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


# గచ్చిబౌలి భూములపై వీడియో షేర్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్‌కి రాష్ట్ర పోలీసుల నుంచి నోటీసు అందింది. దీనికి కారణం స్మితా సబర్వాల్ సామాజిక మాధ్యమాల్లో కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల అడవి ధ్వంసానికి సంబంధించిన ఓ ఏఐ రూపొందించిన చిత్రం షేర్ చేయడమే. ఈ చిత్రం మార్చి 31న 'సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి షేర్ చేయబడింది. ఇది మష్రూమ్ రాక్ వద్ద బుల్‌డోజర్లు, వాటిని చూస్తున్న నెమలి, జింక లాంటి జంతువులతో జిబ్లి స్టైల్‌లో రూపొందించబడినదిగా ఉంది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని చిత్రంలో చూపించారు. ఈ విషయమై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ.. భారతీయ నాగరిక సురక్షా సంహిత లోని సెక్షన్ 179 ప్రకారం స్మితా సబర్వాల్‌కు నోటీసు జారీ చేసినట్లు- తెలిపారు. అయితే, నోటీసులో పేర్కొన్న విషయాలను ఇప్పుడే బయటపెట్టలేమని స్పష్టం చేశారు. సెక్షన్ 179 ప్రకారం కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి, సంబంధిత వ్యక్తులను స్టేట్‌మెంట్ ఇవ్వాలంటూ స్టేషన్‌కు హాజరయ్యేలా పిలిచే అధికారం కలిగి ఉంటాడు. ఈ నిబంధనల ఆధారంగానే స్మితాకు నోటీసు పంపినట్లు- తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రజా చైతన్యాన్ని కలిగించే భాగంలో ఉన్న ఒక అధికారికి నోటీసు రావడం పట్ల అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఐ చిత్రాన్ని షేర్ చేయడం వల్ల నేరపూరిత చర్యలకు దిగడమేంటన్న ప్రశ్నలు కూడా తెరపైకి వచ్చాయి.

# ప్రపంచంలోనే ఏబీవీపీ విశిష్టమైన విద్యార్థి సంస్థ.

**- జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 16:**




ప్రపంచంలోనే ఏబీవీపీ విశిష్టమైన విద్యార్థి సంస్థ అని జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ అన్నారు.

ఎబివిపి ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ బోధన శిక్షణ తరగతులు బుధవారం ప్రాంబించారు. నగరంలోని కవిత కాంప్లెక్స్ లోగల ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రపంచంలోనే అతిపెద్ద విశిష్టమైన విద్యార్థి సంస్థ విద్యార్థుల లో దేశభక్తి జాతీయ భావాలు పెంపొందిస్తూ ఎంతోమంది దేశభక్తులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఏబీవీపీ ఆవిర్భావం నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఈ కార్యక్రమాల్లో భాగంగా పాలిటెక్నిక్ ఉచిత బోధన తరగతిలో నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు.

**ఇందూరు విభాగ్ ప్రముఖ రెంజర్ల నరేష్ మాట్లాడుతూ..**

1982లో కేవలం రెండు కేంద్రాలలో ప్రారంభమైన ఈ బోధన తరగతులు నేడు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అనేక కేంద్రాలలో బోధన తరగతులు అందిస్తూ వేలాదిమంది విద్యార్థులను ఉన్నత లక్ష్యాలకు చేరుస్తుందన్నారు. ఈ యొక్క గొప్ప అవకాశాన్ని ప్రతి విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం పరుచుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి రాజు, సాగర్, ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్, ఇందూరు జిల్లా వ్యవస్థ ప్రముఖ సురేందర్ రెడ్డి, నగర అధ్యక్షులు వెంకటకృష్ణ, కంటేశ్వర్ జోనల్ ఇంచార్జ్ దుర్గా దాస్, ఉచిత పాలిటెక్నిక్ తరగతుల కన్వీనర్ సాయి, రంజిత్, బాలకృష్ణ సునీల్, రాకేష్, అభినవ్, సాత్విక్, గోపి, రాజ్ గణేష్, నవీన్, రంజిత్, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పును స్వాగతించిన బిఆర్ఎస్



హైదరాబాద్:కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలను భారత రాష్ట్ర సమితి స్వాగతం తెలిపింది.ఇది ప్రభుత్వానికి గుణపాఠం కావాలని అన్నారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమని పేర్కొన్నారు.. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం అంటూ పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహారంలో ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ- మా పార్టీ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు- విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘాటించారు. అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి... పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు సీఎం రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.




# విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా రామరామ సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తోన్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆష్రిత వేముగంటి నందూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లేస్‌లో –టె–ండింగ్ అవుతోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. రామ రామ సాంగ్ విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తాజా వార్త చెప్పకనే చెబుతోంది. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర –టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.



# కథ కోసం నానా తంటాలు పడతా



'కల్కి'లో ప్రతి సన్నివేశానికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఎంతో వర్క్ చేశాం. తెరపై చూశాక అది ఫైటింగ్ సీన్ అంటారు. కానీ, దాని వెనక ఎంతో కష్టం ఉంటుందని దర్శకుడిగా తన అనుభవాలను పంచుకున్నారు నాగ్ అశ్విన్. తాజాగా కాలేజ్ స్టూడెంట్స్‌తో ముచ్చటించిన ఆయన ఇండస్ట్రీలో తన అనుభవాలను పంచుకున్నారు. వారితో కొన్ని ఆసక్తికర విషయాలను చెప్పారు. చేసే పని ఏదైనా వందశాతం కష్టపడాలి. షార్ట్ ఫిల్మ్, సినిమా ఏదైనా ఇదే చివరిది అని భావించి తీయాలి. నేను బుక్స్ బాగా చదువుతాను. సినిమాల కంటే పుస్తకాలు మనపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. పరిశ్రమలో కొనసాగాలంటే పుస్తకాలు చదవడం కూడా ముఖ్యమే. మనం అనుకున్న కథను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా రాయగలగాలి. ఒక సామాన్య కథను కూడా ఆసక్తిగా రాయాలి. ఆ సినిమా వెనక నా ఒక్కడి కష్టం మాత్రమే లేదు. అది ఒక టీమ్ కష్టం. టీమ్‌లోని అందరి సలహాలు వింటాను. చిన్నప్పటి నుంచి మహాభారతం గురించి తెలుసు. దాని ఆధారంగా సినిమా తీయాలంటే కొంచెం భయపడ్డానని చెప్పారు. నేను కొన్ని ప్రాజెక్ట్‌లకు ఎడిటర్‌గా కూడా వర్క్ చేశాను. సినిమా బాగా రావడానికి ఎడిటింగ్ ప్రధానం. మొదట స్టోరీ రాసుకుంటాను. అందులోని పాత్రల ఆధారంగా నటీనటులను ఎంపిక చేసుకుంటాను. కల్కిలో పాత్రలు రాసిన తర్వాత మొదట అమితాబ్ బచ్చన్‌ను, తర్వాత ప్రభాస్‌ను సెలక్ట్ చేసుకున్నాను. ది నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఏ సినిమాకు అనిపించలేదు. కానీ, 'ఖలేజా 'డియర్ కామ్రేడ్' సినిమాలను నేను ఎడిట్ చేసి ఉంటే బాగుండేది అనిపించింది. నాకు కామెడీ సినిమాలు అంటే ఇష్టం. ముఖ్యంగా జంధ్యాల సినిమాలు నచ్చుతాయి. నేను ఏదైనా రాసుకున్న తర్వాత రెండు నెలలకు అదే ఐడియా వేరే సినిమా –ట్రైలర్‌లో కనిపిస్తుంది. దీంతో దాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది. 2008లో ఒక కథ రాసుకున్నాను. జ్ఞాపకాలు, కలలు ఈ రెండు అంశాలతో రాశాను. ఇదే కాన్సెప్ట్‌తో వచ్చిన హాలీవుడ్ సినిమా 'ఇన్‌సెప్షన్' ట్రైలర్ చూశాక వారం రోజులు డిప్రెషన్‌లోకి వెళ్లాను. ఎంతో కష్టపడి కొత్తగా ఒక కథను రాస్తే గుర్తించే వారికంటే.. గతంలో వచ్చిన లవ్‌స్టోరీనే మరోసారి తెరకెక్కిస్తే దాని గురించి మాట్లాడేవారు ఎక్కువమంది ఉంటారు. అందుకే ఎప్పుడూ కొత్తగా రాసుకోవాలి. ఎక్కడా రాని పాయింట్ గురించి సినిమాలు తీయాలని అన్నారు.

# ఎర్రబడిన రష్మిక కళ్లు.. ఎందుకంటే

నైట్ షూటింగ్స్ ను బాగా ఎంజాయ్ చేస్తున్న రష్మిక తాజాగా తన ఇన్‌స్టాగ్రమ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో రష్మిక తన నైట్ షూట్స్ గురించి మాట్లాడింది. కిర్రిక్ పార్టీ సినిమాతో హీరోయిన్ గా చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చిన రష్మిక తక్కువ టైమ్ లోనే సౌత్ లో స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఆల్మోస్ట్ సౌత్ లోని అగ్ర హీరోలందరితో సినిమాలు చేసిన రష్మిక ప్రస్తుతం బాలీవుడ్ లో సత్తా చాటాలని చూస్తోంది. యానిమల్ సినిమాతో బాలీవుడ్ లో బ్లాక్ బస్టర్ హిట్ ను అందుకున్న రష్మిక రీసెంట్ గా ఛావా సినిమాతో మరో సెన్సేషనల్ సక్సెస్ ను అందుకుంది. ఇటీవల బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తో కలిసి సికందర్ చేసిన రష్మిక ఆ సినిమాతో డిజాస్టర్ ను అందుకుంది. సినీ ఇండస్ట్రీలో హిట్టూ ఫ్లాపులు కామన్ అనుకుని సికందర్ డిజాస్టర్ ను లైట్ తీసుకున్న రష్మిక ప్రస్తుతం థామా అనే సినిమాలో నటిస్తోంది. ఆ సినిమా కోసం రష్మిక నైట్ షూట్ చేసి బాగా అలసిపోతుంది. ఈ విషయాన్ని స్వయంగా రష్మికనే వెల్లడించింది. ఆయుష్మాన్ ఖురానాతో రష్మిక మందన్నా చేస్తున్న థామా సినిమా గత కొన్ని రోజులుగా నైట్ షూట్స్ జరుపుకుంటుంది. ఈ నైట్ షూట్స్ లో హీరోహీరోయిన్లపై సీన్స్ ను షూట్ చేస్తున్నట్టు సమాచారం.

నైట్ షూటింగ్స్ ను బాగా ఎంజాయ్ చేస్తున్న రష్మిక తాజాగా తన ఇన్‌స్టాగ్రమ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో రష్మిక తన నైట్ షూట్స్ గురించి మాట్లాడింది. రాత్రంతా నిద్ర లేక కళ్లు బాగా ఎర్రగా అయిపోయాయి. షూటింగ్ వల్ల బాగా అలసిపోయా. ఉదయాన్నే అందరికీ పాజిటివ్ వైబ్ ను క్రియేట్ చేయడం కోసం ఈ వీడియోని ఊరికే చేశానని అందరికీ గుడ్ మార్నింగ్. మీరు కూడా నాలానే హ్యాపీగా డేను మొదలుపెట్టాలని కోరుకుంటున్నా, లవ్ యూ ఆల్, ఏం జరిగినా బెస్ట్ ఇవ్వడానికి ట్రై చేయమని చెప్పింది రష్మిక. ఇక సినిమాల విషయానికొస్తే రష్మిక పలు భాషల్లో నటిస్తూ హీరోయిన్ గా ఎంతో బిజీగా ఉంది. బాలీవుడ్ లో థామా సినిమా చేస్తున్న రష్మిక ఆ సినిమాను సమ్మర్ కు పూర్తి చేయనుంది. దీపావళికి థామా రిలీజయ్యే ఛాన్సుంది. ఈ మూవీలో రష్మిక ఓ డిఫరెంట్ పాత్రలో కనిపిస్తుందని సమాచారం. ఇక తెలుగులో రష్మిక కుబేర సినిమాతో పాటూ గర్ల్‌ఫ్రెండ్, రెయిన్‌బో సినిమాల్లో కూడా నటిస్తోంది.





# కథను నమ్మితే...ఇక రంగంలోకి దిగిపోతా

నటుడు విజయ్ సేతుపతి స్పష్టీకరణ

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. పూరి ఫామ్‌లో లేరని ఆయన స్క్రిప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారంటూ విజయ్ సేతుపతిని ట్యాగ్ చేస్తూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా దీనిపై ఈ హీరో స్పందించారు. దీనికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

పూరి జగన్నాథ్‌తో నేను చేయనున్న సినిమా షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. గతంలో వారు చేసిన సినిమాల ఫలితాల ఆధారంగా దర్శకులను జడ్జ్ చేయను. స్క్రిప్ట్ నచ్చితే సినిమా చేస్తాను. పూరి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. అందుకే అంగీకరించాను. ఇలాంటి కథ ఇప్పటివరకూ చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త వాటికి ప్రాధాన్యం ఇస్తాను. గతంలో చేసిన స్టోరీలు రిపీట్ కాకుండా చూసుకుంటాను. ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె గొప్ప నటి. టాలెంటెడ్ కోస్టార్. గతంలో ఎప్పుడూ ఆమెతో కలిసి స్క్రీన్ పంచుకోలేదు. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. విజయ్ సేతుపతి: నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో 'మహారాజ' నాకు ప్రత్యేకమైనది. అందులోని పాత్ర కష్టమైనది. పిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వాటిలో నటించేటప్పుడు వణికిపోయాను. 'సూపర్ డీలక్స్, 'ఉప్పెన'లోని పాత్రలు కూడా కష్టమైనవే. కానీ 'మహారాజ' నా హృదయాన్ని హత్తుకుంది. ఎందుకంటే నేను నిజజీవితంలోనూ ఒక కుమార్తెకు తండ్రినే కదా. నేను బలమైన సందేశం ఉన్న సినిమాలు ఎంచుకుంటాను. అదే నా బలం. పూర్తిగా వినోదాత్మక చిత్రాలలో నటించకూడదని కాదు.. వినోదంతో పాటు సందేశం కూడా ఉండాలి. పూరి సినిమాతో పాటు–

మరో రెండు తమిళ ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. మిస్కిన్ దర్శకత్వంలో 'ట్రైన్' చిత్రంలో నటిస్తున్నాను. ఇది యాక్షన్ చిత్రం. దీనితో పాటు మరో మర్డర్ మిస్టరీలో నటిస్తున్నాను.



# అమీర్‌ను డైరెక్ట్ చేయనున్న వంశీపైడిపల్లి

కొంతకాలంగా వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంటర్‌పై దృష్టి సారించాడు. అమీర్ ఖాన్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించే క్రమంలో ఆయనకు స్టోరీ లైన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమిళనాడులో విజయ్‌తో ఓ సినిమాచేసిన వంశీ పైడిపల్లి ఇప్పుడు హిందీలోకి అడుగు పెట్టాలని చూస్తున్నారు. దిల్ రాజు ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టు–గా చెబుతున్నారు. ఇటీవల ఆయన ప్రొడ్యూస్ చేసిన పాన్ ఇండియా లెవెల్‌లో మరో క్రేజీ ప్రాజెక్టు పట్టాలెక్కేలా కనిపిస్తోంది. బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమిర్ ఖాన్ , టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో సినిమా వర్కవుట్ అయ్యేలా ఉందన్న టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న న్యూస్ ప్రకారం.. వంశీ చెప్పిన సింగిల్–లైన్ ప్లాట్ ఆమిర్‌ని ఫిదా చేసిందట. దీంతో పూర్తి స్క్రిప్ట్ కోసం ఆమిర్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడని తెలుస్తోంది. వంశీ తన రైటర్స్ టీమ్‌తో స్క్రిప్ట్‌ని డెవలప్ చేస్తున్న స్టైల్ ఆమిర్‌కి బాగా నచ్చిందట. స్క్రిప్ట్ రెడీ అయిన వెంటనే మేకర్స్ ఆయనకు చెప్పబోతున్నట్టుగా తెలుస్తోంది. కొంతకాలంగా వంశీ పైడిపల్లితో పాన్ ఇండియా ట్రావెల్ చేస్తున్న దిల్ రాజు నే ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టుగా చెబుతున్నారు.

# కొత్త చిత్రాలతో సందడి



ఉగాదితో తెలుగువారందరికీ కొత్త సంవత్సరం ప్రారంభమైనట్టు– కేరళ, తమిళనాడు ప్రాంత వాసులకు ఏప్రిల్ 14తో నూతన సంవత్సరం మొదలైంది. ఈ విషును తారలంతా ఘనంగా సెలబ్రేట్ చేసారు. ఈ సందర్భంగా కోలీవుడ్, మాలీవుడ్ హీరోలు తమ రాబోయే చిత్రాలకు సంబంధించి అప్‌డేట్స్ షేర్ చేసుకున్నారు. అమరన్ తో సూపర్ హిట్ కొట్టిన శివ కార్తికేయన్ తాజాగా మురుగదాస్ డైరెక్షన్ లో చేస్తున్నసినిమా మదరాసి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసింది యూనిట్. సెప్టెంబర్ 5కే థియేటర్లలో బొమ్మ రాబోతుంది. మాలీవుడ్ స్టార్ యాక్టర్.. నివిన్ పౌలీ విషు సందర్భంగా ఓ సినిమాను స్టార్ట్ చేశాడు. బేబీ గర్ల్ అనే మూవీకి ఏప్రిల్ 14న కొబ్బరి కాయ కొట్టారు. ఫస్ట్ కుంచికో బొబన్ హీరోగా అనుకుంటే ఆయనకున్న కమిట్‌మెంట్స్ వల్ల డేట్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ నివిన్ చెంతకు చేరింది. 2023లో మలయాళంలో వచ్చిన గరుడన్ ఫేం అరుణ్ వర్మ ఈ చిత్రానికి దర్శకుడు. ఫహాద్ ఫజిల్, కళ్యాణీ ప్రియదర్శన్ జంటగా నటిస్తోన్న మూవీ ఒదుం కుతిరా చదూం కుతిరా ఫస్ట్ లుక్ పోస్టర్ విషు సందర్భంగా రిలీజ్ చేశారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో క్రేజీ వెడ్డింగ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నాడు డైరెక్టర్ అల్తాఫ్ సలీమ్. అలాగే తెలుగులో ఈగ తరహాలో మలయాళంలో ÷–లపైతో సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. లవ్లీ అనే –టైటిల్‌తో తెరకెక్కుతోన్న మూవీ నయా అప్డేట్ వచ్చింది. ఈ సినిమాను గతంలో ఏప్రిల్ 4న విడుదల చేయాలనుకోగా ఇప్పుడు మే 4కు పోస్ట్ పోన్ అయిందని తెలుపుతూ పోస్టర్ రిలీజ్ చేసారు. మొత్తానికి పండగ కానుకగా సినిమాల విశేషాలను ప్రేక్షకులతో షేర్ చేసుకున్నారు మేకర్స్.

# గుడ్ బ్యాడ్ అగ్లీలో ఇళయారాజా పాటలు రీమిక్స్

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా నోటీసులు పంపారు. తెలుగులో అగ్రగామి సంస్థగా సినిమాలు రూపొందిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో తమిళ సినిమా పరిశ్రమలో అడుగుపెట్టింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ హీరోగా యంగ్ డైరెక్టర్ ఆదిక్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ పై ఏఇ÷ఖ సినిమాను నిర్మించారు. ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ టాక్ తెచ్చుకుని రికార్డ్ స్థాయి కలెక్షన్స్ రాబడుతోంది.

అయితే ఈ సినిమాలో కొన్ని సీన్స్ లో ఒకప్పటి తమిళ్ సినిమాలలోని ఇళయరాజా సంగీతం అందించిన సాంగ్స్ ను గుడ్ బ్యాడ్ అగ్లీలో వారిని రీమిక్స్ చేసి ఉపయోగించారు. ఆ సదరు సీన్స్ థియేటర్స్ లో ఫ్యాన్స్ ఆ సాంగ్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబందించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే తన పాటను అనధికారికంగా వాడుకోవటం పై ఇళయరాజా ఆగ్రహం వ్యక్తం చేసారు. సినిమాలో తన పాటలు వాడడం పై నోటీ–సులు ఇచ్చారు ఇళయరాజా. నష్టపరిహారం కింద తనకు ఐదు కోట్ల రూపాయలు చెల్లించాలంటూ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ కు నోటీ–సులు పంపారు ఇళయరాజా. అదే విధంగా గుడ్ బ్యాడ్ అగ్లీలోని మూడు పాటలను వెంటనే నిలిపివేయాలని మరియు 7 రోజుల్లోగా చిత్ర బృందం బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఇళయరాజా డిమాండ్ చేసారు. మరి ఇప్పుడు మైత్రి మూవీ మేకర్స్ ఈ నోటిసులపై ఎలా స్పందిస్తారో చూడాలి.

